


# జారి పడిన ఊలు ఉండ!

ప్రేమ గుడ్డిది. అంటే ప్రేమించినవారు గుడ్డివారు. కళ్లుండీ అంధులైనవారు. కనుకనే అన్ని భ్రమలకు లోనవుతూవుంటారు. చదువుకునే వయసులో వున్న జవ్వని ఊలుఉండ జారిపడిమా కానలేకపోతుంది. ఇంతకూ ఆమె కళ్లు తెరిపించగల శక్తి పరిపూర్ణమైన ప్రేమ అనుభవంలోకి వచ్చిన ఆపెకు మాత్రమే సాధ్యమేమో!.

జె.ఎన్.ఎస్. మూర్తి

"ప్రాణేశ్వరా...!"

వద్దు, ఒక్కసారిగా అంత దిగజారిపోవడమా?

"ప్రియతమా!"

ఊహుఁ... అదీ బాగుండదు.

"ప్రియమైన కృష్ణమూర్తి గారికి..."

ఇందిర ఆ పేరును మళ్లీ మళ్లీ చదువుకుంది.

చేతిలో ఉన్న పెన్ "తరువాత ఏమి వ్రాయాలి?" అని ప్రశ్నించింది. పెన్నును పెదవులకానించి పెట్టుకుని ఆలోచించింది. ఎంతసేపాలోచించినా ఏమీ తోచలే. దామెకు. చివరికి ఫౌంటెన్ పెన్ మూసి వాటిని బాగ్‌లో పడేసింది.

తరువాత ఏమి వ్రాయాలి?

పిచ్చిపిచ్చిగా వ్రాస్తే ఆయ నేమనుకుంటారో?తనను చూచి అదోలా నవ్వుతారెందుకు? ఆ నవ్వులో ఏదో మంత్రం ఉంది. లేకపోతే తనెందుకంత ముగ్ధురాలవుతుంది?

"ఇందూ... అదేమిటలా ఒక్కదానివే కూర్చుని నవ్వుకుంటున్నావు? లే, బెల్లయింది!" అంటూ తను కూర్చున్న దగ్గరికి వచ్చింది అరుణ. అరుణ ఇందిర 'క్లాసుమేటు.'

ఇందిర గాభరాగా లేచి, అటూ ఇటూ చూసింది. అప్పటికే అందరూ క్లాసుల్లోకి వెళ్లిపోయారు.

"నీ కోసమే ఎదురుచూస్తున్నాను, పద!" అంది తనను తాను సంభాళించుకుని.

ఎవరికోసం ఎదురుచూస్తున్నావనేది నాకు తెలీదేమిటి? ఆయనప్పుడే క్లాసులోకి వెళ్లిపోయారు. పోదాం, రా!" అని చెయ్యి పట్టుకుని లాగింది అరుణ.

తన రహస్యం బయటపడిపోయిందని ఇందిరకు సిగ్గేసింది. ముఖం ఎర్రబడింది. అరుణ

చెవులు పట్టుకుని "అందరూ నీలాంటివారే ననుకుంటున్నావా? అది సరేగానీ త్వరగా పద!" అని ముందుకు నడిచింది.

ఇద్దరూ క్లాసురూములో అడుగుపెట్టారు. క్లాసులో కృష్ణమూర్తి పాఠం చెబుతున్నాడు.

"మే ఐ కమ్ ఇన్ సార్?" అని వయ్యారం ఒలకబోస్తూ అడిగింది ఇందిర.

క్షణకాలం ఆమెవంక చూచి, "ఎస్!" అనేసి పాఠం చెప్పడంలో మునిగిపోయాడు ప్రొఫెసర్ కృష్ణమూర్తి.

అప్పుడప్పుడూ నుదుటిమీద వచ్చే చెమటను జేబురుమాలుతో తుడుచుకుంటూ పాఠం చెప్పడంలో లీనమైపోయిన కృష్ణమూర్తి వంక రెప్ప వాల్చకుండా చూస్తోంది ఇందిర. నిరంతరంగా సాగే వాగ్ధాటి-అభినయపూర్వకంగా చెప్పే వివరణ-ఇవన్నీ ఇందిర హృదయంలో కలవరం రేపాయి.

ఆ రోజు తనను చూసి శిలాప్రతిమలా నిల్చుండిపోయారు. తను ఆయన కళ్లల్లోకి చూసేటప్పటికి తప్పు చేసిన పిల్లాడిలా తల వంచుకుని వెళ్లిపోయారు. ఎవరన్నా చూస్తారన్న భయమేమో!

'ఆ వేళ తన శరీరంలో విద్యుత్ సంచారమైనట్టయింది. ప్రేమ అంటే అదేనేమో?!'

అప్పటినుండి లేడీస్ రూంలోని కిటికీ ఊచల్లో మొహం ఉంచి, బస్సులోంచి దిగి మెల్లగా అడుగులు వేస్తూ కాలేజీకి వచ్చే ఆ కృష్ణమూర్తిని చూచినప్పుడంతా తన హృదయం ఉప్పొంగిపోయేది. ఎన్నోసార్లు నోట్సు నెపంతో ఆయన దగ్గరికెళ్లినప్పుడు తన కళ్లలో కళ్లుపెట్టి చూసేవారు-మరుక్షణమే ముఖం కిందికి వాలిపోయేది.

'అరుణ చెప్పింది నిజమేనేమో!-రెండు హృదయాలు ముందు కళ్లతోనే పలకరించుకుంటాయి. రఘూ, అరుణల ప్రేమ అలాగే ఏర్పడిందట!'

ఏమీ ఎరుగనిదానిలా ఉంటూ రఘును గెలుచుకున్న అరుణవంక చూసింది ఇందిర.

తను ఆమెకన్నా అందమైనది-నీలాలవంటి తన కళ్లు ఎవరినైనా ఓడించేస్తాయి.

"ఇందూ, నీ కళ్లల్లో హిప్నాటిక్ పవర్ ఉంది" అంటుంది అరుణ అప్పుడప్పుడూ.

మొదట రఘును చూసి తనుకూడా ఇష్టపడింది. తన తండ్రి, తన మనసుకు నచ్చిన వరుణ్ణి పెళ్లి చేసుకోవటానికి అనుమతి ఇచ్చిన తరువాత మొట్టమొదట తన మనస్సులో రఘు సాక్షాత్కరించాడు. కానీ అరుణ అదేం మంత్రం వేసిందో, ఆమెకు దాసుడైపోయాడు.

"ఇప్పుడు నా కృష్ణమూర్తిని ఎవరు దొంగిలించగలరు? రఘు కన్నా అందమైనవాడు కృష్ణమూర్తి."

గర్వంతో ప్రక్కనున్న అరుణ వంక చూచింది ఇందిర.

**ఈ కథను ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక 21.6.1961 సంచికలో ప్రచురించాము**

000

అటూ ఇటూ చూపులు సారిస్తూ, చీర కుచ్చెళ్లు నేలమీద జీరాడిస్తూ, విలాసంగా నడుస్తున్న ఇందిర కాళ్లు టక్కున ఆగిపోయాయి. ఒక్క క్షణం చెవులు రిక్కించి ఆలకించింది. లైబ్రరీ హాల్‌లో నుండి వినిపిస్తున్న ఆ కంఠం ఆమెకు అత్యంత ప్రియమైనదే. పక్కనున్న అరుణను కూడా లాక్కుని లోపలికి వెళ్లింది. కృష్ణమూర్తి కొందరు విద్యార్థులతో ఏదో చర్చిస్తున్నాడు.

ఇందిరవైపు అతని చూపు మరలలేదు.

లైబ్రేరియన్‌తో బిగ్గరగానే మాట్లాడుతూ కృష్ణమూర్తివైపు వోరగా చూచింది ఇందిర. అయినా అతను ఆమెవైపు చూడలేదు. ఇందిరకు కష్టం కలిగింది. ఏదో నిర్ధారణ కొచ్చినట్టు అడుగులు వేస్తూ, కృష్ణమూర్తి కూర్చున్న దగ్గరికి వచ్చి నిలబడింది. ఆమె రావడం చూసి కృష్ణమూర్తి చర్చ ఆపాడు.

"సార్! నేను వ్రాసిన నోట్సు చూశారా?" అని వయ్యారంగా అడిగింది.

"ఇదిగో, తీసుకోండి. చాలా బాగా వ్రాశారు. ముందు ముందు ఇంగ్లీషు ఆనర్సు తీసుకోవడానికి అభ్యంతరం లేదు!" అంటూ తను పట్టుకున్న పది పన్నెండు పుస్తకాల్లోంచి ఆమె నోట్సును తీసిచ్చాడు.

అది తీసుకునేటప్పుడు అతని వేళ్లు ఆమె చేతికి తగిలాయి. ఆ స్పర్శకు ఇందిర ఒళ్లు గగుర్పొడిచింది.

"ఎనీ కామెంట్ సార్?"

"అందులో అన్నీ వ్రాశాను!" అనేసి విద్యార్థులవైపు తిరిగాడు కృష్ణమూర్తి. అతని వేళ్లు తన చేతికి తగిలిన మధురానుభవాన్నే మనసులో నింపుకుని, భారంగా అడుగులు వేస్తూ బయటకు వచ్చింది. పుస్తకం తెరిచి చూడాలన్న ఆదుర్దా, అయినా అరుణ కొంటెమాటలకు భయపడి ఆ పుస్తకాన్ని తెరవలేదు. ఆ సంగతి గమనించినట్లు అరుణ ఇందిర చేతినుంచి నోట్సు లాక్కుని "ఏమి వ్రాశారో, చూద్దాం!" అని పుస్తకం తెరిచింది.

"డోంట్ యూజ్ సొ మెనీ కొటేషన్స్. యూ ఆర్ నాట్ స్టడీయింగ్ పి.హెచ్‌డి."

"ఒక్క మాటతోనే చంపేశారే! అయినా అక్షరాలు ఎంత అందంగా ఉంటాయి ఆయనవి!" అంది ఇందిరను ఏడిపించాలని అరుణ.

ఇందిర పొడిగా నవ్వి ఊరుకుంది. 'ఒక్క మాటతోనే ఏమిటి, అసలు మాట్లాడకుండానే చంపుతున్నారు!' అనుకుంది మనసులో.

"బెల్లయింది. ఇప్పుడు ప్రొ.చంద్రం పాఠం చెబుతారు, త్వరగా రా!" అని ఇందిరను లాక్కుని క్లాసువైపు నడిచింది అరుణ.

లైబ్రరీ హాల్‌లోంచి తన కృష్ణమూర్తి బయటికి వస్తారేమో! ఎప్పటిలా చిరునవ్వుల అమృతధారలో తనను ముంచెత్తుతారేమో అనుకున్న ఇందిర కోరిక అలాగే ఉండిపోయింది.

క్లాసులో కూర్చుని ఉన్నా ఆమె మనసు లైబ్రరీలోనే విహరిస్తోంది. ప్రొఫెసర్ చంద్రం పాఠం చెబుతున్నాడు. ప్రొఫెసర్ చంద్రం, ప్రొఫెసర్ కృష్ణమూర్తి అంటే అందరికీ చాలా ఇష్టం. అందులోనూ ప్రొ.చంద్రం మాటలు ఎవరినైనా ఒకరిని ఏడిపిస్తూ, అందరికీ నవ్వు పుట్టిస్తూంటాయి. అయినా పాఠంమీద మనసే నిలవలేదు ఇందరకు.

'కిందటివారమే ఆ లేఖ వ్రాయవలసింది... ఆయన చదివి ఉంటే బాగుండేది... ఆయన తనను ప్రేమించినట్లే తనుకూడా అతన్ని ప్రేమిస్తోందని తెలిసిపోయేది... తను ఆ లేఖ ఎప్పుడో వ్రాసి ఉండేది ... కానీ అరుణ 'పురుషుడే ముందు శరణాగతుడవ్వాలి' అనే మంత్రం ఉపదేశించిందిగా!

'తనను చూసి ఎందుకలా తప్పించుకుంటారు? ఇంకెవరినైనా...? ఊహుఁ... తన కృష్ణమూర్తి అలాంటివారు కాదు!

'ఈవేళ ఏమైనా సరే, అడిగి తీరాలి... వారం రోజుల్లో ఎవరో పెళ్లిచూపులకొస్తారట. నాన్నకు ఏదో ఒకటి గట్టిగా చెప్పేయాలి... ఆయన్ను ఎక్కడ కలుసుకోవడం? ఏమని అడగటం? వాళ్లింటికి వెడితే సరి... ఎవరైనా చూస్తే?... చూస్తే భయమేమిటి ప్రేమించినప్పుడు? నిజమైన ప్రేమ ఉన్నప్పుడు ఎవరేమంటే తనకేం?'

చివరి బెల్ అవగానే లేచి అరుణతోపాటు బస్సుస్టాండుకు చేరుకుంది. బస్సు వచ్చి అరుణ అందులో ఎక్కి వెళ్లిపోయినా తను అలాగే నిల్చుని ఉంది.

'కృష్ణమూర్తి ఎప్పుడు వస్తారో?... వాళ్లింట్లో ఎవరెవరున్నారో?' అని ఆలోచిస్తూంటే, ఆమె గుండె వేగంగా కొట్టుకోసాగింది.

తెలుగు ప్రొఫెసర్ కృష్ణారావుతో కలిసి వస్తున్నాడు కృష్ణమూర్తి. ఇందిర ఒంట్లో వణుకు ప్రారంభమైంది.

శీతాకాలం కాకపోయినా చలితో ఒళ్లు కొంకర్లు పోతున్నట్టనిపించింది. కృష్ణమూర్తి ఆమెవైపు ఒకసారి చూశాడు. కృష్ణారావుతో ఏమిటో చెప్పాడు. 'తన గురించే చెప్పాడేమో...! లేకపోతే ఆయన నవ్వుతూ తనవైపెందుకు చూస్తారు?' ఇందిర చెక్కిళ్లు రక్తవర్ణం దాల్చాయి.

వాళ్లిద్దరూ బస్సుస్టాండులో ఆగకుండా ముందుకు నడిచారు. ఇందిరకు నిరాశ కలిగింది. క్షణకాలం ఏమీ చేయడానికి తోచక నిలబడిపోయింది. తరువాత ముందుకు నడిచింది.

వాళ్లిద్దరూ కబుర్లు చెప్పుకుంటూ మెల్లగా నడుస్తూ, చివరి బస్‌స్టాపు చేరేలోగా చీకటి పడింది. దారిపొడవునా కృష్ణారావును తిట్టుకుంటూనే ఉంది ఇందిర తన మనస్సులో. రాములవారి గుడి దగ్గర ఆగారు వాళ్లిద్దరూ. వాళ్లు ఏమిటేమిటో మాట్లాడుకుంటున్నారు. ఇందిర ఇదంతా గమనిస్తూనే ఉంది.

"బై బై!" అనేసి కృష్ణమూర్తి బయలుదేరాడు. కృష్ణారావు ఎడమవైపు తిరిగాడు. సందు మలుపు తిరిగేవరకూ అక్కడే ఉండి, కృష్ణమూర్తి వెళ్తున్నవైపు గబగబా నడిచింది ఇందిర.

గేటు తెరుచుకుని కృష్ణమూర్తి లోపలికెళ్లడం చూసింది. వెంటనే వచ్చి కాంపౌండు గోడ దగ్గర ఆగింది. లోపలకెళ్లడానికి ఆమె కాళ్లు ముందుకు సాగలేదు.

'ఒకవేళ తిరస్కరించితే?' గుండె దడదడలాడింది.

కృష్ణమూర్తి లోపలకెళ్తూ ఉండగా, ఎదురుగా సోఫాలో కూర్చుని అల్లుకుంటూ ఉన్న స్త్రీమూర్తి కనిపించింది ఇందిరకు. గుండె ఆగిపోయినంత పనైందామెకు.

కృష్ణమూర్తి మెట్లెక్కి లోపలకెళ్తున్నాడు. 'బహుశా చెల్లెలేమో!' తన మనసుకు తానే సమాధానం చెప్పుకుంది ఇందిర.

కృష్ణమూర్తి లోపలికెళ్లగానే "ఈజ్ ఇట్ యూ?" అన్న కోమలకంఠం వినిపించింది ఇందిరకు. కృష్ణమూర్తి నవ్వుతూ వెళ్లి, "ఎస్, శాంతా! నేనేనని నీకెలా తెలిసింది?" అని ఆమె జుత్తు నిమిరాడు. శాంత తన వల్చని పెదవులతో మందహాసం చేస్తూ, తల పైకెత్తి "మీ అడుగుల చప్పుడు నాకు తెలియదా?" అంది. కృష్ణమూర్తి వంగి,. ఆమె పెదవులను ముద్దు పెట్టుకున్నాడు. అది చూసి ఇందిరకు తన కాళ్లకింద భూమికంపించినట్టయింది. ఆమెకు అక్కడ నిల్చోబుద్ధి కాలేదు. పిచ్చిదానిలా పరుగెత్తుకుంటూ వచ్చి ఇంట్లో సోఫామీద కూలబడిపోయింది. ఎదురుగా ఆమెకు ప్రియమైన నోట్సు బుక్కు పడి ఉంది. కోపంతో దాన్ని విసిరేసింది. తనావేళ సగం వ్రాసి వదిలేసిన ఉత్తరం కనిపించగానే కోపంతో దాన్ని ముక్కలు ముక్కలుగా చింపేసింది.

ఆ రోజు ప్రేమతో వ్రాసిన ఉత్తరం ఈ రోజు చిత్రవధ గావించబడి నేలమీద పడి ఉంది. గదిలో ఇటూ అటూ పచార్లు చేయసాగింది. భరించలేని కోపంతో పెన్ను తీసుకుని, నాలుగు వాక్యాలు వ్రాసింది.

"శ్రీ కృష్ణమూర్తిగారికి,

"మీరు సభ్యత కలవారనుకున్నాను. మీరు వంచకులు. ఎంతమంది కాలేజీ యువతులను ఈ విధంగా మోసగించారో? ఇకముందైనా మీ భార్యకు అన్యాయం చేయకుండా ఉండండి!

"ఇట్లు,

"మీచే వంచితురాలైన, ఇందిర."

000

నాలుగైదురోజులు ఇందిర కాలేజీకి వెళ్లలేదు. 'కర్మచాలక తను వ్రాసిన ఉత్తరం ప్రిన్సిపాలుకు చూపిస్తే తన గతేమిటి?' అన్న భయం పట్టుకుందామెకు. రెండు రోజులు అరుణ వచ్చి పిలిచినా, "నాకు ఒంట్లో బాగుండటం లేదు-నేను రాను!" అని తప్పించుకుంది.

అయిదవరోజు అరుణ వచ్చి, "ఇందూ! ఇదిగో చూడు, నేనేం తెచ్చానో!" అని చేతిలో ఉన్న కవరు చూపించింది. "పాపం! కృష్ణమూర్తిగారు నిన్ను ఎంతో అడిగారు. చివరికి ఈ వేళ ఈ ఉత్తరం ఇచ్చి నీకిమ్మన్నారు. నీకోసం నేను హంసనవ్వాల్సి వచ్చింది కదా!" అంటూ ఆ కవరు ఆమె చేతికిచ్చింది. కానీ దాన్ని విప్పి చూడబుద్ధి కాలేదు ఇందిరకు.

"ఊఁ... ఇంకేమిటి, అదే... లవ్వూ గివ్వూ... వ్రాశారేమో! ఆయనకు వేరే పనేముంది?" అంది.

"ఓహో... నా దగ్గరే ఏమీ తెలియని నంగనాచిలా నటిస్తావేం?" అంటూ ఆ ఉత్తరం లాక్కుని తనే చదివింది అరుణ. కానీ చదువుతూంటే ఆమెకు చాలా ఆశ్చర్యం కలిగింది.


"ఎవరూ ఈ శాంత? నీకు సోదరిట? ఆ... రేపు సాయంకాలం వాళ్లింటికి టీకి పోవాలిట. ఈ కొత్తస్నేహం ఎప్పుడు చేశావు నాకు తెలియకుండా? నేనేమో కృష్ణమూర్తిగారి ఆహ్వానమనుకున్నాను!" అంది అరుణ.

ఇందిరకు ఆ రోజు తనుపడ్డ అవస్థ అంతా అరుణతో చెప్పాలనిపించింది. కానీ చెప్పలేకపోయింది. "ఏమో, నాకూ అంత బాగా తెలియదు. మళ్లీ పిలవడానికి వస్తారేమో! నువ్వు కూడా రా!" అంది ఇందిర ఎటువైపో చూస్తూ.

## హృతిక్‌కు హాలీవుడ్ ఛాన్సు!

హృతిక్ విచిత్రంగా వుంటాడని తొలిరోజుల్లో సుభాశ్‌ఘై వంటి దర్శకుడే అన్నాడు. కానీ ఆ 'లుక్సే' హృతిక్‌ను హాలీవుడ్‌లో నిలబెట్టేటట్టున్నాయి. తాజావార్తగా వెలువడిన సమాచారమేమిటంటే-హృతిక్‌ను సిల్వెస్టర్ స్టాలన్ చిన్నతమ్ముడుగా నటించమంటూ హాలీవుడ్ నుంచి ఆఫర్స్ వచ్చాయట. ఇలాంటివాళ్లు సాధారణంగా ఇంగ్లీషు చిత్రాల్లోకే సరిపోతారనుకున్నారో ఏమో, మరి! అంతేకాదు, షేక్స్‌పియర్ నాటకం ఓదానిలో నటించాలంటూ థియేటర్ల నుంచి కూడా ఆహ్వానం వచ్చిందట. అమ్మ హృతిక్! చూస్తూండగానే జాతీయస్థాయి నుంచి అంతర్జాతీయస్థాయి దాకా వెళ్లిపోతాడేమో!

ఎస్



"ఒకరిని పిలిస్తే ఇద్దరెందుకు? నేను, రాను. అంత పరిచయం లేనివాళ్లు ఎలా పిలుస్తారూ అంట?"

ఇందర మౌనంగా ఉండిపోయింది. ఆమె మనసు అటూ ఇటూ ఊగిసలాడుతోంది.

"ఎందుకో నాలుగు రోజులనుండి మారిపోయావు ఇందిరా! రేపు కృష్ణమూర్తితో చెప్పి ..." అని కళ్లు చిట్లించి, ఇందిర బుగ్గ గిల్లింది అరుణ. బుగ్గలు గిల్లినా అవి ఎరుపెక్కలేదు.

'ఏ నాటికైనా తనే అన్నీ చెబుతుందిలే!' అని మనస్సులో అనుకుని, "నేను వెళ్తాను, ఇందిరా!" అని వెళ్లిపోయింది అరుణ.

ఇందిర శాంత వ్రాసిన ఉత్తరం మళ్లీ చదువుకుంది. 'తనెందుకు వాళ్లింటికి వెళ్లాలి? వెళ్లకపోతే?' ఆమె మనసు కాసేపు అటూ ఇటూ ఊగిసలాడింది.

శాంత ఆహ్వానాన్ని మన్నించకుండా ఉండలేకపోయింది. అంత ఆత్మీయత ఉందా ఉత్తరంలో.

"నీవు తప్పకుండా వస్తావని నాకు పూర్తిగా నమ్మకముంది. నా సోదరి మనసు నాకు తేలీదా? తప్పకుండా వస్తావు కదూ!"

శూన్యదృష్టితో ఆ ఉత్తరాన్నే చూస్తూ కూర్చుంది ఇందిర.

000

మరునాడు సాయంకాలం బస్సు దిగి కృష్ణమూర్తి ఇంటికి వెళ్లింది ఇందిర. ఎదురుగా ఇంటి వరండాలో తనకోసం ఎదురుచూస్తూ పచార్లు చేస్తున్న కృష్ణమూర్తి కనిపించాడు. లోపలికెళ్లేసరికి ఆ రోజులాగే శాంత అల్లుతూ కూర్చుని ఉంది. ఇందిర శాంతకెదురుగా వచ్చి కూర్చుంది. ఎదురుగుండా గోడమీద కృష్ణమూర్తి, శాంతల ఫొటో ఉంది. నీలికాంతితో మెరిసే శాంత కళ్లు చూసి అసూయ కలిగింది ఇందిరకు. ఆ ఫొటోవైపే చూస్తూ కూర్చుంది.

"ఇందిరా, వచ్చావా? మన పరిచయం ఎప్పుడో అయింది!" మందహాసం చేస్తూ అంది శాంత.

దానికేమి జవాబు చెప్పాలో తెలియక ఊరుకుంది ఇందిర.

"నాతో మాట్లాడటం ఇష్టంలేదా ఇందిరా?"

"అదేంలేదు!" తల వంచుకునే జవాబిచ్చింది ఇందిర.

శాంత వంటావిడను టీ తెమ్మని చెప్పింది. కాసేపటికి వంటావిడ టీ తెచ్చి ఇద్దరికీ చెరో కప్పూ ఇచ్చింది. మౌనంగానే టీ తాగారు.

ఖాళీకప్పును వంటావిడకు అందిస్తూ, "మీ ఇల్లెక్కడ?" అని ప్రశ్నించింది శాంత ఇందిరను. ఇందిర చెప్పింది.

"మీదీ ఊరేనా?" మళ్లీ అడిగింది.

"అవును. మా నాన్నగారు ప్లీడరు."

"మాది విశాఖపట్టణం, ఇందిరా! వారిది ఆ దగ్గరలోనే ఉన్న ఒక పల్లెటూరు. కాలేజీ చదువుకోసం విశాఖపట్టణం వచ్చి, మా ఇంటి పక్కనే ఒక గదిలో అద్దెకుండేవారు. వారు ఎం.ఎ. చదువుతున్నప్పుడు, అంటే అయిదేళ్ల కిందట మా పెళ్లి జరిగింది!" అని అల్లుతూనే చెప్పింది శాంత. ఆమె అల్లే విధానం ఇందిరకు వింతగా తోచింది. సంగీతానికి తాళలయబద్ధంగా అడుగులు వేసే నాట్యకత్తెలా, ఆమె చేతివేళ్లు క్రమం తప్పకుండా ఆడుతున్నాయి.

"ఏమీ



చేయకుండా ఉత్తినే కూర్చోబుద్ధేయదు!"

"పుస్తకాలు చదవవచ్చుగా?"

"నేను బి.ఏ.లో ఉన్నప్పుడు ఆ భాగ్యం పోయింది!" అంది శాంత దుఃఖంతో. కిందికి జారడానికి సిద్ధంగా ఉన్న కన్నీళ్లను తుడుచుకోవడానికి చెయ్యెత్తినప్పుడు, ఒళ్లో ఉన్న ఉలెన్ ఉండ దొర్లి కిందపడిపోయింది. శాంత వంగి చూడకుండా, చేత్తో తడమసాగింది. అది ఆమె కాలి దగ్గరే పడి ఉంది. ఇందిర వంగి దాన్ని అందుకున్నది. కానీ శాంత ఇంకా తడిమి చూస్తూనే ఉంది.

"కళ్లల్లో ఏమున్నా పడిందా?" అని గాభరాగా అడిగింది ఇందిర, ఉండను ఆమె చేతిలో ఉంచుతూ.

శాంత కళ్లల్లోంచి నీరు జారి, ఆమె చీరమీద పడి ఇంకిపోయింది. "అవును, కాస్త ఒకసారి ఊదుతావా?" అంది శాంత కళ్లు తుడుచుకుని.

ఇందిర ఆమె ముఖాన్ని వెలుతురు వైపు తిప్పి పట్టుకుని ఊదబోయింది. కానీ ఒక్కసారిగా అదిరిపడి "ఇదేమిటీ, మీ కళ్లు తెల్లగా ఉన్నాయి?" అని అడిగింది.

"అవును. ఆ ఫొటోలోని కళ్లకూ, నా కళ్లకూ ఉండే తేడాచూసి అడుగుతున్నావు కదూ? ఫొటోలోని ఆ కళ్లకు కృత్రిమమైన రంగు లేదు. ఆ కళ్లను చూచే వారు నన్ను ప్రేమించింది. పెళ్లికి ముందు కొన్ని రోజులు విపరీతమైన తలపోటు వచ్చి ఆ కళ్లలోని నీలిరంగు కరిగిపోయింది. అయినా నాలాంటి గుడ్డిదాన్ని పెళ్లి చేసుకున్నారు!" ఆమె కంఠం కంపిస్తూంది.

"నా కళ్లల్లోని కాంతినే నీ కళ్లల్లో చూసినప్పుడు..." శాంత ఇంకా చెబుతూండగానే ఇందిర గబుక్కున "తెలిసిందిలే అక్కయ్యా!" అంది.

"వారిని క్షమించవా?"

"వారే నన్ను క్షమించాలి. నేను వారికి ఏమిటేమిటో వ్రాసి బాధపెట్టాను!" అని శాంతను కౌగలించుకుంది ఇందిర.

కిటికీలోంచి చూస్తున్న కృష్ణమూర్తి కళ్లు తుడుచుకున్నాడు. ■

## సల్మాన్ పెళ్లికానుకలు!

ఇవి సల్మాన్‌ఖాన్‌కు జరిగే పెళ్లికి కానుకలు కావు, సల్మాన్ ఇతరులకు ఇచ్చే కానుకలు! మరీ అంత ఉదారంగా ఇచ్చేస్తున్నాడా ఏమిటి?-అని ఆశ్చర్యపోకండి! సల్మాన్ తన కోసమో, లేదా తనకిష్టులైన వారికోసమో ఏదైనా తయారుచేయించడం, దాన్ని మరెవరికో ఇచ్చేయవలసిరావడం జరుగుతున్నాయట! పాపం ఈ 'బాడీఖాన్' ఇళ్లు కట్టించి గిఫ్టులుగా ఇవ్వడం చాలా ఇష్టపడుతున్నాడల్లేవుంది. తొలిసారి సంగీతాబిజిలానీ కోసం కొన్న పెంట్‌హౌస్‌ను తన సోదరుడు సొహెయిల్‌ఖాన్‌కు పెళ్లికానుకగా ఇవ్వాల్సివచ్చింది. ఆ తరువాత సోమీఅలీ ప్రియురాలుగా వున్నప్పుడు, కట్టించిన ఫ్లాట్‌ను మరో సోదరుడు అర్బాజ్‌ఖాన్‌కు పెళ్లి బహుమతిగా ఇచ్చేశాడు. మరో పెంట్‌హౌస్‌ను తనకోసం కొనుగోలు చేశాట్ట ఇటీవలే. చివరికి ఇదైనా అతనికి 'స్వీట్‌హోమ్'గా దక్కుతుందో లేదో!

ఎన్.